క్లుప్తంగా

అడిగిన వారందరికీ పనులు కల్పిస్తాం

● డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి


పనులను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

కల్లూరు: జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు అధికారి(పీడీ) అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చెట్లమలాపురం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేస్తే పూర్తి వేతనం లభిస్తుందన్నారు. ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ఉదయం త్వరగా వచ్చి పనులు ముగించుకుని త్వరగా వెళ్లాలని కూలీలకు సూచించారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి


కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్:మండల ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డ్వామా ఏపీడీ అల్లిపీరా సూచించారు. బుధవారం సి.బెళగల్ పరిధిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. కూలీలు దినసరి వేతనం రూ.257లు వచ్చేలా కొలతల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. అలాగే అడిగిన వారందరికీ పనులను కల్పించాలని, కూలీల సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వీరి వెంట ఏపీఓ లక్ష్మన్న ఉన్నారు.

రైతులకు బోనస్ అందజేత


పాడి రైతులకు బోనస్ అందిజేస్తున్న విజయ డెయిరీ డైరెక్టర్ సరళమ్మ

పాణ్యం: నంద్యాల విజయ డెయిరీకి పాలు పోస్తున్న రైతులకు డెయిరీ బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. బుధవారం నెరవాడ గ్రామంలోని 18 మంది పాడి రైతులకు డైరెక్టర్ సరళమ్మ బోనస్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెయిరీ రైతులకు మరింత ప్రోత్సాహకంగా నిలుస్తుందన్నారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

గడివేముల:రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్యరాకుండా చూడాలని ఎంపీడీఓ విజయసింహారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావే శం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.నీటి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రా మా ల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ ఖాలిక్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు


దంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

కర్నూలు(రాజ్‌విహార్): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. బుధవారం రాత్రి స్థానిక నగర శివారులోని సుంకేసుల రోడ్డు సంజీవని హాస్పిటల్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 23 మంది పట్టుబడటంతో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం పేర్కొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

కర్నూలు(న్యూటౌన్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి మండల అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జెడ్పీలోని కర్నూలు మండల కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. దినసరి వేతనం రూ.257 పడేలా పనులు కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీడీ నాగేశ్వరరావు, ఏఓ మురళీమోహన్‌రెడ్డి, గోపీకృష్ణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

ఆరోగ్యం చల్లకుండ

● పేదోడి ఫ్రిజ్‌కు పెరిగిన డిమాండ్
● మట్టి కుండల్లోని నీటితో అనేక ప్రయోజనాలు
● మార్కెట్లో అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల మట్టి పాత్రలు, కుండలు


పెద్ద మార్కెట్ వద్ద మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్నట్లు.. మళ్లీ ఎక్కువ మంది మట్టి కుండలు, మట్టి ప్రాతల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పేదోడి ఫ్రిజ్‌కు డిమాండ్ పెరిగింది. ఒకప్పుడు మన జీవితాలతో మమేకమైన మట్టి పాత్రలు, కుండలు.. మారిన జీవన శైలితో స్టీల్, ప్లాస్టిక్, పింగాణి ప్రాతలు రావడంతో వాటి వాడకం పూర్తిగా తగ్గింది. మట్టి కుండలోని నీరు తాగడం, మట్టి పాత్రలలో చేసిన ఆహారం తినడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాలంలో ధనవంతులు కూడా మట్టి కుండలోని నీటిని తాగడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం అభిరుచులకు అనుగుణంగా రంగు రంగుల్లో మట్టి కూజాలు, కుండలు, పాత్రలు, గ్లాసులు, జగ్గులు మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి.

కుండలోని నీరు శ్రేష్టం :
మట్టి కుండలకు సహజ సిద్ధంగా మంచినీటిని చల్లబరిచే గుణముంది. ఫ్రిజ్‌లోని చల్లని నీరు తాగడం వల్ల గొంతు నొప్పి, శ్వాసకోస వ్యాధులు వస్తాయి. అయితే కుండలోని నీరు శ్రేష్టమైనది. ఆ నీటిని తాగడం వల్ల ఆరోగ్యానికి మంచిది. పైగా ఎటువంటి రోగాలు రావు. మండుటెండలో తిరిగి అలసటగా ఇంటికి చేరుకున్నప్పుడు ఓ గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే దాహార్తి తీరి ఎంతో ఊరట లభిస్తుంది. ఆనీటిలో ఎటువంటి హానికర రసాయనాలు ఉండవు. దీంతో కడుపులో మంట, ఇతర జీర్ణ సమస్యలు తగ్గుతాయి. అతిగా దాహం వేయదు. వడదెబ్బ రిస్క్ కూడా తగ్గుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. మట్టి పాత్రలో చేసిన ఆహారం రుచిగా ఉంటుంది.



ఆహారపదార్థాలలో పోషకాలు వృథా కావు. ఆహారంలో యాసిడ్ మట్టి పత్రాలోని ఆల్కలైన్‌తో చర్యకు గురై పీహెచ్ స్థాయిలు తటస్థీకరిస్తుంది. మట్టి పాత్రలలో చేసిన ఆహారం అన్ని రకాలుగా ఆరోగ్యదాయకం. ప్రస్తుతం కర్నూలు నగరంలో మట్టి కుండలు, పాత్రలకు గిరాకీ పెరిగింది. పత్తికొండ, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, జడ్చర్ల, రాజస్థాన్, తమిళనాడులో తయారు చేసిన మట్టి కుండలు, వాటర్‌ఫిల్టర్‌లు, నీళ్ల బాటిళ్లు, టీ కప్పులు, కూజాలు, దీపాలు, తులసికోట, బిర్యాని కుండలు, పెరుగు కుండలు, హండీలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.1500 వరకు విక్రయిస్తున్నారు.


రాజస్తాన్ కుండలు


అమ్మకానికి ఉంచిన కూజాలు, మట్టి పాత్రలు

30 ఏళ్ల నుంచి వ్యాపారం



30 ఏళ్ల నుంచి కుండలు,మట్టిపాత్రలను జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసు కుని విక్రయిస్తున్నాం. వేసవికాలంలో మట్టికుండలకు బాగా డిమాండ్ ఉంటుంది. మట్టికుండల సైజులను బట్టి రూ.200 నుంచి 1200 దాకా విక్రయిస్తాం. పాతకాలంలో మాదిరిగానే చాలా మంది మట్టికుండల్లో వంటలు చేసుకుని తినడానికి ఇష్టపడుతున్నారు. –కె వెంకటేశ్వరమ్మ, చిరు వ్యాపారి, కర్నూలు

మట్టి కుండలతో జీవనం



కులవృత్తిని నమ్ముకుని మట్టికుండలు, పాత్రలను విక్రయిస్తున్నాం. వేసవి కాలంలో 20 నుంచి 50 కుండల వరకు విక్రయిస్తాం. మట్టి కుండలతో పాటు మట్టి వాటర్ బాటిల్స్, టీ కప్పులు, వాటర్ ఫిల్టర్స్‌ను సైజును బట్టి అమ్ముతున్నాం. మట్టి కుండలు కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతున్నారు.
–కె.పద్మావతి, కర్నూలు

మట్టి కుండల్లోని నీరే శ్రేష్టం



మారుతున్న కాలానికి అనుగుణంగా ఎన్ని రకాల ఫ్రిజ్‌లు, వాటర్ ఫిల్టర్లు వచ్చినా మట్టి కుండలోని నీటికి సాటిరావు. వేసవిలోనే కాక అన్ని కాలాల్లో మట్టి కుండల్లోని నీరు చాలా శ్రేష్టం. ఎండల్లో బయటికి వెళ్లి ఇంటికి వచ్చిన వెంటనే ఒక గ్లాసు మట్టి కుండలోని నీరు తాగితే ఎంతో హాయిగా ఉంటుంది. – ఎస్.మహేంద్రకుమార్, కర్నూలు

కబడ్డీ విజేత శకునాల


కబడ్డీ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఓర్వకల్లు: మండలంలోని ఎస్ కొంతలపాడులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో శకునాల జట్టు విజేతగా నిలిచింది. గ్రామంలోని అంబా సహిత యాగంటీశ్వరస్వామి తిరుణాల సందర్భంగా నిర్వహించిన పోటీలలో మొత్తం 32 జట్లు పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. అందులో శకునాల జట్టు తొలి స్థానంలో నిలిచి రూ.25 వేలను కైవసం చేసుకుంది. రెండవ స్థానంలో నిలిచిన హుసేనాపురం జట్టు రూ.20 వేలు, మూడో స్థానంలో నిలిచిన కొమరోలు జట్టు రూ.15 వేలు, నాలుగో స్థానంలో నిలిచిన పంచలింగాల జట్టు రూ.10 వేలు, ఐదో స్థానంలో నిలిచిన మిట్టకందాల జట్టు రూ.5 వేల నగదు బహుమతులను దాతల చేతుల మీదుగా అందుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచు మధుకేశన్న, గ్రామ నాయకులు మద్దయ్య, రాముగౌడు, ఆర్గనైజర్లు మాధవస్వామి, రాజు పాల్గొన్నారు. అలాగే సీఐటీయూ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో రివర్స్ పోటీలో పాలకొలను గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రవి మొదటి స్థానంలో నిలిచి రూ.5,016, లొద్దిపల్లె గ్రామానికి చెందిన ఇమ్మానుయేలు రెండవ స్థానం సాధించి రూ.3,016, రాజేష్ మూడో స్థానంతో సరిపెట్టుకుని రూ.2,016 నగదు బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, షాజాహాన్, ఆటో యూనియన్ సభ్యులు గోరంట్ల, జగదీష్‌గౌడు, నారాయణ, నాగేశులు, నాగన్న, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో 'స్పందన' నిర్వహించాలి


పోలకల్‌లో సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

సి.బెళగల్: సచివాలయాల్లో ప్రతిరోజు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఎంపీడీఓ రాముడు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం పోలకల్ సచివాలయం- 3ను తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలో ఉద్యోగుల విధుల నిర్వహణపై సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించారు. సమయ పాలన పాటించాలిని, ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలన్నారు.

☛ సేవలను మరింత విస్తరించాలని సి.బెళగల్ - 1 గ్రామ సచివాలయ నోడల్ అధికారి, పశువైద్యుడు ప్రవీన్‌కుమార్ సూచించారు.బుధవారం ఆయన స్థానిక సచివాలయం - 1ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు కార్యాలయ నిర్వహణపై సూచనలు చేశారు. అక్కడ ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

● కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


సిబ్బందితో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): విధుల పట్ల నిర్లక్ష్యం తగదని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ వైద్య సిబ్బందికి హితవు పలికారు. సమయ పాలన పాటించడం లేదనే ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం ఆయన ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సయ్యద్ ముక్తార్ పాషాతో పాటు పలువురు సిబ్బంది ఇంకా విధులకు రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి ఇలా వ్యహరించడం తగదని అభిప్రాయ పడ్డారు. గ్రామస్తులు కూడా అక్కడికి చేరుకుని మెడికల్ ఆఫీసర్‌పై ఫిర్యాదు చేయడంతో వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటివి పునరావృతం కాకుండా డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట వైస్‌ఎంపీపీ-2 నెహేమ్యా, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు


వెంకటగిరిలో దేవర సందర్భంగా శ్రీమారెమ్మకు పూజలు చేసేందుకు పోటెత్తిన భక్తులు


గంధంతో బడేఖాన్ ఖాద్రీ దర్గాకు వెళ్తున్న భక్తులు


క్రిష్ణదొడ్డిలో పూజలందుకున్న పెద్దమ్మ అమ్మవారు

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో బుధవారం మారెమ్మ అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవరను పురస్కరించుకుని బోణాలతో ఆలయానికి చేరుకుని మారెమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలకు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కుడా చైర్మన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పలుకుదొడ్డిలో..
సి.బెళగల్: మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో బడేఖాన్ ఖాద్రీ ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు గంధం ఊరేగింపు కార్యక్రమాన్ని భక్తులు సంబరంగా నిర్వహించారు. గంధాన్ని దర్గా వద్దకు చేర్చినట్లు పీఠాధిపతి మసూద్‌బాషా తెలిపారు.

క్రిష్ణదొడ్డిలో ఘనంగా దేవరా..
మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ శివారులో కొలువైన పెద్దమ్మ అమ్మవారి దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు గ్రామస్తులు బోణాలతో ఊరేగింపు నిర్వహించారు. ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు.

నేడు బురాన్‌దొడ్డిలో..
బురాన్‌దొడ్డిలో గురువారం జరగనున్న గోకారమయ్య ఉరుసుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం దర్గాలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గంధం కార్యక్రమం బుధవారం రాత్రి ప్రారంభమై గురువారం ఉదయం దర్గాకు చేరుకుందని నిర్వాహకులు తెలిపారు.



కబడ్డీ జట్టుకు అభినందన

కర్నూలు(టౌన్): గత నెల 26 నుంచి 28వ తేదీ వరకు చిత్తూరు జిల్లా నగరిలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీల్లో అండర్-14 బాలికల విభాగంలో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. దీంతో ఆ జట్టును స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య బుధవారం అభినందించారు.

5న అరుణాచల క్షేత్రానికి హైటెక్ బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): గిరి ప్రదక్షిణ దీపోత్సవం సందర్భంగా తమిళనాడులోని అరుణాచల క్షేత్రం దర్శనం కోసం ఈ నెల 5వ తేదీన నడిపే సూపర్ లగ్జరీ (హై టెక్)ప్రత్యేక బస్సు(సర్వీస్ నంబర్-93999)ను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు కర్నూలు నుంచి ఈ బస్సు బయలుదేరి, 6వ తేదీన తెల్లవారు జామున 4:30గంటలకు అరుణాచలానికి చేరుకుంటుందన్నారు.గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వర స్వామి దర్శనం, దీపోత్సవం అనంతరం అదే రోజు సాయంత్రం 4గంటలకు బస్సు బయలుదేరి, 7వ తేదీ ఉదయం 6 గంటలకు కర్నూలుకు చేరుకుంటుందని వెల్లడించారు. అరుణాచలం క్షేత్ర దర్శనం రాక, పోకల కోసం బస్సు చార్జీ రూ.2వేలు ఉంటుందని,ఇందులో ముందస్తు టిక్కె ట్లు తీసుకునేందుకు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు.బస్టాండ్లు, ఏజెంట్లు, ఆన్‌లైన్ ద్వారా టిక్కెట్లు పొందవచ్చని, వివరాలకు అసిస్టెంట్ మేనేజరు సెల్7382871131,9959225794(తన) నంబర్లకు,డిపోమేనేజర్లనుసంప్రదించాలని సూచించారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు బుధవారం 1,730 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 0.845 టీఎంసీల నీటి నిల్వ ఉంది. కేసీ కాల్వకు 1,325 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

పెద్దాసుపత్రిలో ముగ్గురికి అరుదైన శస్త్రచికిత్సలు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జనరల్ సర్జరీ విభాగంలో ముగ్గురికి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించి ప్రాణం పోశారు. వివరాలను ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణనాయక్ తెలిపారు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం దీవెనపల్లి గ్రామానికి చెందిన కంబగిరి(60)కి గొంతు వద్ద థైరాయిడ్ కారణంగా గాయటర్(కణితి) ఏర్పడింది. సాధారణ పరిమాణం కంటే పెద్దగా ఉండటమే గాక రక్తనాళాలకు పెనవేసుకుని ఉండటంతో శస్త్రచికిత్స నిర్వహించి ఈ నెల 23న కణితిని తొలగించారు. అలాగే గుత్తికి చెందిన మెహ్రాజ్‌బీ(70) అనే వృద్ధురాలికి పాంక్రియాస్‌కు క్యాన్సర్ రావడంతో అరుదైన శస్త్రచికిత్స చేశారు. తెలంగాణా రాష్ట్రం గద్వాల జిల్లా ఐజకు చెందిన పుష్ప(30) పొరపాటున వక్కను మింగడంతో ఈ నెల 7న ఆసుపత్రిలో చేరింది. పేగులో ఇరుక్కున్న వక్కను ల్యాప్రోస్కోపీ ద్వారా ఈ నెల 9న తొలగించారు. వీరు ముగ్గురు కోలుకోవడంతో బుధవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. శస్త్రచికిత్స నిర్వహించిన వారిలో తనతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సాబిరా, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మన్సూర్‌బాషా, డాక్టర్ మధుసూదన్, సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ చైతన్యవాణి, పీజీలు ఉమేష్ చంద్ర, షాబాజ్ జహాన్, ప్రియాంక, శాంతి స్వరూప్, మమత, చిన్ని, సర్ఫరాజ్, శిరీష, సాయిచరణ్ పాల్గొన్నట్లు ఆయన పేర్కొన్నారు.


కోలుకున్న రోగులతో వైద్యుల బృందం

ఠంచన్‌గా పింఛన్

నెల మొదటి రోజే పెన్షనర్లకు పింఛన్ సొమ్ము అందింది. బుధవారం తెల్లవారు జామునే వలంటీర్లు ఇళ్ల వద్దకు వెళ్లి లబ్ధిదారుల వేలిముద్రలు సేకరించి పింఛన్ నగదు అందజేశారు. మరో రెండు మూడు రోజుల్లో వంద శాతం పింఛన్ పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

● తెల్లవారు జామునే పింఛన్ల పంపిణీ చేపట్టిన వలంటీర్లు
● సాయంత్రంలోపు 90 శాతం పూర్తి


ప్యాలకుర్తిలో లబ్ధిదారుడు రాకేష్‌కు వికలాంగుల పింఛన్ అందజేస్తున్న వలంటరీ హమీద్


సి.బెళగల్‌లో వృద్ధురాలు సుంకులమ్మకు పింఛన్ నగదును ఇస్తున్న వలంటీర్ వడ్డె శేఖర్


కొంగనపాడులో వృద్ధురాలు సవారమ్మ నుంచి వేలి ముద్రలు తీసుకుంటున్న వలంటీర్ మహేంద్రగౌడ్


ఆలమూరులో నాగలక్ష్మమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటరీ శిరిష

కోడుమూరు మండలంలో 90 శాతం..
కోడుమూరు రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా మండలంలోని మొదటి రోజే 90 శాతం మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు అందజేశారు. మొత్తం 8,880 పెన్షనర్లు ఉండగా సాయంత్రానికి 7,883 మందికి అందజేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. వేలిముద్రలు పడని వృద్ధులు, దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఫేష్ యాప్ ద్వారా పింఛన్ సొమ్మును వలంటరీలు అందజేస్తున్నారన్నారు.

గూడూరులో 84.11 శాతం..
గూడూరు: పట్టణంలో బుధవారం తెల్లారకముందే వలంటీర్లు పెన్షనర్లకు పింఛన్ అందించారు. పడమర బీసీ కాలనీలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎన్ అస్లామ్, బోయ అక్కన్న, కౌన్సిలర్లు ఖలీల్, నందకిశోర్ తదితరులు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించారు. మొదటి రోజే 84.11 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

సి.బెళగల్ మండలంలో 87.31 శాతం..
సి.బెళగల్: మండలంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీని వలంటీర్లు తెల్లవారు జాము నుంచే మొదలుపెట్టారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు. మొదటి రోజు మండల వ్యాప్తంగా 87.31 శాతం పూర్తయినట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు.

కల్లూరు మండలంలో 74 శాతం..
కల్లూరు: మండలంలో పింఛన్ల పంపిణీని వలంటీర్లు తెల్లవారు జామునే మొదలుపెట్టారు. మండల వ్యాప్తంగా 8,229 పింఛన్లు ఉండగా మొదటి రోజు బుధవారం 6,097 మందికి పంపిణీ చేశారు. 74 శాతం పూర్తికాగా రెండు మూడు రోజుల్లో 100 శాతం పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

తెల్లవారక ముందే..
పాణ్యం: మండలంలో 6,297 వైఎస్సార్ పింఛన్ కానక లబ్ధిదారులు ఉన్నారు. వలంటీర్లు వీరికి ఉదయాన్నే పింఛన్ అందించేందుకు నడుం బిగించారు. ఉదయం నుంచి సాయంత్రంలో 4,317 మందికి పింఛన్ పంపిణీ చేశారు. మిగిలిన 1980 మందికి రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు.

గడివేముల మండలంలో 64.2 శాతం
గడివేముల: వలంటీర్లు బుధవారం పెన్షనర్లకు పింఛన్ సొమ్ము అందజేశారు. మండలంలో 5,685 పింఛన్లు ఉండగా 3,650 మందికి పంపిణీ చేశారు. సాయంత్రానికి 64.2 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ విజయసింహారెడ్డి తెలిపారు.

కర్నూలు మండలంలో..
కర్నూలు (న్యూటౌన్): మండలంలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్ కానుకను అందజేశారు. మండల పరిధిలోని 23 గ్రామాల్లో 10,050 మంది లబ్ధిదారులకు రూ.2,80,68,250 నగదును పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ నాయుడు తెలిపారు.